# ఏది జ్ఞానమునందించునో అదియే విద్య

**కంటి కగుపించు దృశ్యంబు కాంచి మీరు**
**సత్యమిదియని నమ్మకుడీ సంబరమున**
**తెరను దాగిన సత్యంబు తెలిసికొనగ**
**విశ్రమించక నాతోడ వెడలిరండు**
**సత్యమిదియని తెలుపుడు సంతసముగ**

విద్యార్థులారా!

భారతీయ చరిత్రలు పవిత్రమైన భారతీయ సంస్కృతిపై ఆధారపడి ఉంటున్నవి. వేదశాస్త్రయితిహాస పురాణ ప్రమాణములన్నియు ఈ సంస్కృతిపైనే ఆధారపడి ఉన్నవి. భారతీయ సంస్కృతి, సంస్కృతముపై ఆధారపడి ఉన్నది. ప్రాచీనకాలమునుండి ప్రతి పల్లెయందు సంస్కృతమును వాడుకునేవారు. ప్రతి మానవుడు ఒకరినొకరు క్షేమసమాచారములు ప్రశ్నించు సమయమందుకూడ సంస్కృతభాషనే ఉచ్చరించేవారు. వీధినాటకములందుకూడ సంస్కృత పదములే ఉపయోగించేవారు. అర్థము తెలియకపోయినా ఆ సంస్కృత పదములందున్న మాధుర్యము ఇట్టిది, అట్టిది అని ఎవరు వర్ణించలేకపోయారు. 'ద్రౌపదీ వస్త్రాపహరణమ'ని వీధి నాటకమాడుచుండు సమయములో ఒక సూతుడు ఉండేవాడు. ఏ వేషము ఆ స్టేజిపైకి వచ్చినా 'ఎవరండి మీరు, ఎక్కడనుండి వచ్చారు, ఎందుకోసము వచ్చారు', అని ప్రశ్నించే పని ఆ సూతునిది. మొట్టమొదట ధర్మరాజు స్టేజిపైకి వచ్చాడు. సూతుడు ప్రశ్నించాడు, 'ఎవరండి మీరు? ఎందుకొచ్చారు? ఎక్కడనుంచి వచ్చారు?' అని. అప్పుడు ధర్మరాజు 'ఎట్టి పరిస్థితులందైనా, ఎట్టి బాధలయందైనా, ఎట్టి కష్టములందైనా ఎట్టి దుఃఖములందైనా త్రికాలములందు నేను సత్యమునే పలికేవాడను' అని జవాబిచ్చాడు. ధర్మము మొట్టమొదట స్టేజిపై ప్రవేశించింది.

sri sathyasai vachanamrutam

## సత్య, ధర్మములు హృదయమునుండి ఆవిర్భవించేవి

ఈ ప్రపంచమే ఒక వేదిక. మాయయే యిక్కడ సూతుడు. ఆ ధర్మము ప్రతివ్యక్తియందు ప్రవేశించి, ఆధర్మమును నిర్మూలము గావించి, సత్యమార్గములో ప్రజలను నడిపిస్తుంది. అదియే ఈ ధర్మముయొక్క స్వరూపము. అట్టి ధర్మమును వేదము 'సత్యం వద, ధర్మంచర' అని ప్రత్యేకంగా ప్రబోధిస్తూ వచ్చింది. 'నాయనా! ఈ జగత్తునందు ఏమైనా నీవు మరచవచ్చుగానీ, ఏమైనా నీవు వదలవచ్చుగానీ సత్యమును ధర్మమును వదలవద్దు. సత్యము పలుకు, ధర్మము ఆచరించు' అని బోధించింది. అయితే ఈ వేద వాక్యములు ఎంతమంది నడచుకుంటున్నారు? ఈ సత్యము, ధర్మము మనస్సునుంచి వచ్చేవికావు. 'హృత్ దయ' అనగా హృదయమునుండి ఆవిర్భవించేవి. బుద్ధియొక్క compassion, కరుణచేత యివి ఆవిర్భవించేవి. కర్మలచేత వర్ధిల్లేవికాదు. హృదయమునుండి అవిర్భవించాలి. మధ్యమార్గములో ప్రకృతియొక్క భావము పురస్కరించుకొని అభ్యాసముచేత వచ్చేదికాదు. దురదృష్టవశాత్తు ఈనాటి మానవుడు బుద్ధిని విస్మరిస్తున్నాడు. హృదయాన్ని మరచిపోతున్నాడు. మనసునే లక్ష్యము నందుంచుకుంటున్నాడు. మనసును అనుసరించుటకు ప్రయత్నిస్తున్నాడు.

**మనసునాధారముగగొను మానవుండు**
**పశువుకంటెను హీనమై పతనమగును**
**బుద్ధినాధారముగగొను బుధజనుండు**
**పశుపతిగ మారునని పల్కె పర్తివిభుడు.**

## సర్వకర్మలు మనస్సే ఆచరింపజేస్తుంది

ఈనాడు ప్రతి మానవుడు, ఒక సంకల్పము ప్రారంభమైన తక్షణమే actionలో ప్రవేశిస్తున్నాడు. అదే మనస్సుయొక్క లక్షణము. నిజానికి, దీనిని లక్షణమని చెప్పకూడదు. ఇది అవలక్షణం. Thoughts వచ్చిన తక్షణమే action లో ప్రవేశపెట్టకూడదు. బుద్ధికి అందించాలి. అక్కడ బుద్ధి నిర్ణయము చేస్తుంది. నిత్యానిత్యవిషయపరిశీలన సలుపుతుంది. Is it good or bad, is it right or wrong అని విచారిస్తుంది. ఆ విచారణ చేయటంచేత

sri sathyasai vachanamrutam

మానవుడు సత్క్రమమైన మార్గములో ప్రవేశిస్తాడు. పంచభూతములకు నిలయము ఆకాశము. ఆకాశము శబ్దమునకు నిలయము. ఈ శబ్దము ఎక్కడనుంచి వచ్చింది?

**శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ**
**నిత్యానందమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ.**

ఇవన్నీ శబ్దమునుండి ప్రారంభమైనవే! ఈ శబ్దము ఎక్కడనుంచి వచ్చింది? బ్రహ్మముండి శబ్దము ప్రారంభమైంది. ఈ శబ్దమునుండి ఆత్మ ప్రారంభమైంది. ఆత్మనుండి మనస్సు పుట్టింది. మనస్సునుండి వాక్ పుట్టింది. వాక్కు తరువాత action జరిగింది. కనుక, ఆత్మకు మొదటిపుత్రుడు mind. మనస్సుయొక్క పుత్రుడే వాక్కు. వాక్కు ఆత్మకు grand son. క్రియ great grandson. మన క్రియ, వాక్కు, మనస్సు, ఆత్మ ఒక్క family. మనస్సుకు అనేక ఉపమానములు చెప్తుతుంటారుగానీ, చాలా పొరపాటు. ఆత్మ స్వభావములే అక్కడ ఉండాలి. 'ఆత్మనా పుత్రనామాసి'. ఆత్మయే తన పుత్రనామంతో ఉద్భవిస్తున్నాడు ఈ జగత్తునందు. తండ్రి, కుమారుని స్వరూపములో ఉద్భవిస్తున్నాడు. కాబట్టి ఆత్మకు direct గా వచ్చిన కుమారుడు మనస్సు. మనస్సును నీచంగా మనం ఉపయోగించరాదు. ఇష్టము వచ్చినట్లు దానిని ప్రవేశపెట్టరాదు. విశ్వమునంతా చూస్తుంది. శబ్దమునంతా వింటుంది. కానీ దానికి ఒక్క స్వరూపములేదు. రూపములేదు. కానీ సర్వకర్మలు మనస్సే ఆచరింపచేస్తుంది. అయితే కనిపించే సమస్త వస్తువులు ఉపయోగించవలసినవే కదా, త్యజించవలసినది కావని మీరు భ్రమించవచ్చు.

**జాగ్రత్స్వప్నసుషుప్తులలోని అనుభవములన్ని మనస్సు సృష్టించినవే!**

మానవ జీవితమందు మూడుస్థానములుంటున్నవి. జాగ్రత్‌స్వప్నసుషుప్తులు. విశ్వుడు జాగ్రత. ఆ విశ్వుని స్వరూపము అనేక రూపనామములతో కూడినది. ప్రాజ్ఞుడు స్వప్నావస్థ. ప్రాజ్ఞుడనే దానిని విశ్వుడే అనేక సంకల్పములతో రూపొందింపచేస్తాడు. నీకు నిద్ర వచ్చింది. ఆ నిద్రలో నీవు బొంబాయి పట్టణము చేరావు. అక్కడ అన్ని రకముల అనుభూతులు నీవు పొందావు. తల్లిదండ్రులను చూచావు. మిత్రులను చూచావు. అన్ని విధముల ఆనందించావు. కానీ యింతమందిని ఏది సృష్టించింది? మైండ్! నిన్నే సృష్టించింది. నీ

ప్రయాణమును సృష్టించింది. బొంబాయిని సృష్టించింది. తల్లిదండ్రులను సృష్టించింది. మిత్రులను సృష్టించింది. సమస్త బజార్లు సృష్టించింది. సృష్టించింది మాత్రమే గానీ అనుభవించటము లేదు.

**కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవుకదా!**

బొంబాయిలో అంతా చూచావు, మెరెన్‌డ్రైవు మొదలైనవి. కానీ తెల్లవారేటప్పటికి ఏ దృశ్యమూ లేదు. శివాజి పార్కులో ఆటలంతా చూచావు. కానీ తెల్లవారి లేచేటప్పటికి ఏ ఒక్కటి కనిపించటంలేదు. కాళీ టెంపుల్ రోడ్డులో పోయి ధర్మక్షేత్రాన్ని చూచావు. తెల్లవారి లేచేటప్పటికి ప్రశాంతినిలయంలోనే ఉన్నావు. ఈ చూచింది ఎవరు? అనుభవించింది ఎవరు? అనుభవింపచేసింది ఎవరు? అంతా మనసే? కనుక, ఇది అనేక రకములైన నాటకములాడిస్తుంది. మనము చేసినవి, చూచినవి అన్నీ దృశ్యకల్పితమైనవేగానీ హృదయసంబంధమైనవికాదు. చూచేది వేరు, చేసేది వేరు, చదివేది వేరు, చేసేది వేరు. విద్యార్థులు ఇక్కడ ఉన్నారు. మీరు text books చదువుతున్నారు. అధ్యాపకులు చక్కగా బోధిస్తున్నారు. డిగ్రీలు తీసుకుంటున్నారు. ఉద్యోగములు లభిస్తున్నాయి. ఉద్యోగములో ప్రవేశించావు. కానీ నీవు చదివినవి ఆ ఉద్యోగములో ఏమి ఉపయోగపెడుతున్నావు? ఏ మాత్రము యిక్కడ చదివినవి అక్కడ ఉద్యోగములో ప్రవేశపెట్టటంలేదు. ఎందుకు ఈ చదువులు? చదివినవి సమాజములో వినియోగించుటకు తగిన శక్తిసామర్థ్యములు కలిగి ఉండాలి. కేవలము ఏదో service చిక్కింది, పొట్టనిండుతుంది అని భావిస్తున్నావు. కేవలం కుటుంబము జరుగుతుంది. జీవితము వెళ్లిపోతున్నాది. యిదే చాలనుకుంటున్నాము. ఏ వ్యక్తి అయినా 'నేను చదివినది ఏమిటి, నేను చేసేది ఏమిటి, ఈ చదువువల్ల ఫలితము ఏమిటి', అనే సత్యమును విచారించుటకు ప్రయత్నించటంలేదు. మనం జన్మించిన సమాజములో మన చదువును తగిన రీతిగా ఉపయోగపెట్టాలి. వంటరూములో వంట వండినావు. అన్నీ మంచి రుచిగానే ఉంటున్నాయి. ఎన్నో రకములైన వంటలు వండినావు. కానీ దానిని తెచ్చి డైనింగ్ హాలులో వచ్చిన guest కి వడ్డించినప్పుడుకదా ఫలితము లభిస్తుంది. వంట రూములో చేసినది వంటరూములోనే పెట్టి వచ్చి guest ను హోటలుకు

తీసుకుపోతే వంట ఎందుకు చేయించాలి? చేసిన వంట ఏమి ప్రయోజనము? ఎంత నిరుపయోగము?

**మనం తెలుసుకున్న మంచి విషయములు మనస్సులో హత్తుకునిపోవాలి**

అదే విధముగా మనం తెలుసుకున్న మంచి విషయములు, మనము అనుభవించిన మంచి విషయములు మనస్సులో ప్రింటు అయిపోవాలి. ఒకానొక సమయంలో ఉద్ధవుడు కృష్ణునినుంచి గోపికలకు ఒక message తీసుకువచ్చాడు. కానీ ఆ message ఎవరికి అందించుటకు వీలుకాక పోయింది. గోకులములోని గోపికలు, గోపాలురు కృష్ణుని ప్రేమ మనస్సుకు హత్తుకు పోయినవారు. అనేక శాస్త్రములు, ఉపనిషత్తులు, యోగములు అన్నీ తెలుసుకున్నవాడు ఉద్ధవుడు. ఈ ఉద్ధవుడు కృష్ణునితో చెప్పాడు 'స్వామీ! చదువుసంధ్యలేని మూర్ఖులు, యీ గోపికలు. భగవంతుని శక్తిని ఏమాత్రం అర్థము చేసుకోలేరు. అలాంటివారికి నేను అక్కడికి పోయి యోగము బోధించి తద్వారా తమ సాక్షాత్ స్వరూపాన్ని తప్పక వారికి దర్శింప చేస్తాను' అన్నాడు. అయితే కృష్ణుడు పంపాడు అంటేనే గోపికలు వస్తారుగానీ యింకెవరు పంపినా రారు. వారికి ఏ దేవుడులేడు, కృష్ణుడు తప్ప. బ్రహ్మ వచ్చాడు. వారు చూడలేదు. విష్ణువు వచ్చాడు, వారు చూడలేదు. శివుడు వచ్చాడు, శివుని వారు చూడలేదు. అందువలన, 'చూడని వాటిపై ఏ రీతిగా మా మనస్సు లగ్నము గావించేది?' అని భావించారు, గోపికలు. కృష్ణునే! అతని ఒక్కరి శక్తిసామర్థ్యములనే అనుభవించినది. కనుక కృష్ణుడు తప్ప అన్యము మాకు అక్కరలేదు అనుకున్నారు. అప్పుడు ఉద్ధవుడు 'కృష్ణా! చీటి వ్రాసి యివ్వండి. మీరు వ్రాసిస్తే తమ దగ్గరకు రానిస్తారు, లేకపోతే నన్ను అక్కడ ప్రవేశింపచేయ'రన్నాడు. వ్రాసి యిచ్చాడు, కృష్ణుడు. ఏమని? 'ప్రియమైన గోపికలారా! నా పరమమిత్రుడు ఉద్ధవుడు ఈ చీటిని తీసుకువస్తున్నాడు. అతని ఆదర్శమును మీరు అనుసరించండి'. లేఖను విప్పి చూచారు, గోపికలు. కృష్ణుని రథములోనే వచ్చాడు ఉద్ధవుడు. అంతా మోసమైపోయింది. అ రథము వచ్చి యశోద యింటిముందు నిల్చింది. కృష్ణుడు వచ్చాడని ఏ ఆహ్వానము లేకపోయినా గోపికలందరు వచ్చారు, యశోద యింటికి. కృష్ణుడు ఎక్కడ? రాత్రింబవలు కన్నులు కాయలు కాచేటట్లు

sri sathyasaivachanamrutam

చూచి నిరాశపడ్డారు. మధురకు వెళ్లిన కృష్ణుడు బృందావనము రాలేదు. నిరాశకు గురైయ్యారు. నిస్పృహ పొందారు. శరీరములో ఏ శక్తిలేదు. కానీ ఆనందముగా పరుగెత్తారు. ఉద్ధవుడు చూపించాడు, చీటి. 'కృష్ణుడు పంపించాడు' అని చెప్పాడు. ఒక గోపిక చెప్పింది, 'ఉద్ధవా! మేము గోపికలము. పల్లెపడుచులము. మాకు ఈ చదువులు రావు. మా తల్లితండ్రులు ఏ పాఠశాలకు మమ్ము పంపలేదు. ఓనమాలుకూడా తెలియవు. అంత మూర్ఖులమైన మేము కృష్ణుని లేఖ ఏ విధంగా చదువగలము?' అని ప్రశ్నించారు. అయితే వారిలో ఒక గోపికకు అక్షరాలు తెలుసు, అమెకు అందించాడు, ఉత్తరము. కాని, అమె ముట్టలేదు. 'ఉద్ధవా! నీకు నమస్కారము. నాకు తెలుసు, కృష్ణునితో ఎన్ని పర్యాయములో మాట్లాడాము. కృష్ణుని సంగతి నాకు బాగా తెలుసు. కానీ నేను దానిని ముట్టలేను' అన్నది. ఉద్ధవుడు అడిగాడు, 'ఎందుకు ముట్టకూడదు? కృష్ణభక్తి యింత గొప్పదిగా మీరు భావిస్తున్నారు, విశ్వసిస్తున్నారు, ఆరాధిస్తున్నారు, ఆనందిస్తున్నారు. ఎందుకు దీనిని మీరు ముట్టకూడదు?' అని. తిరిగి 'భక్తి ప్రపత్తులు మీకు ఏమాత్రము అర్థముకాదు' అన్నాడు. అప్పుడు గోపికలు చెప్పారు, 'కృష్ణవియోగముచేత మా దేహము మండిపోతున్నాది. ఆ జాబును మేము ముడితే జాబు కాలిపోతుందో ఏమిటో? కృష్ణుని చేతివ్రాత భస్మము చేయటం మాకు యిష్టములేదు'. ఎంత గొప్ప భక్తి వారిది! నాకు తెలుసు విద్యయని యింకోరు ఎవరైనా చక్కగ చదవవచ్చుకానీ గోపికలు ఆ పని చేయలేదు. 'నా దేహము నఖశిఖపర్యంతరము కృష్ణవియోగాగ్నిలోపల మాడిపోతున్నాది. ఏది ముట్టినా అది కాలిపోయే స్థితిలో ఉంది. కనుక కృష్ణుని పవిత్రమైన, సువర్ణ అక్షరములను భస్మము చేయటానికి మాకు యిష్టము లేద'న్నారు. యింకొక గోపికకు చూపించాడు. ఆ గోపిక చెప్పింది, ఉద్ధవా! నీకు ఒక నమస్కారము. నాకు కృష్ణుని చేతివ్రాత బాగా తెలుసు. దానిని చదవటానికి ప్రయత్నం చేస్తే దుఃఖాన్ని భరించుకోలేము. మా కంటి ధారలు జాబుపై పడి అక్షరములంతా చెదిరిపోతాయి. పదములు చెదిరిపోయిన తరువాత ఏ రీతిగా చదవాలి? కనుక నేను దానిని చదవను', అనింది. కడపటికి ఉద్ధవుడే చదివాడు. చదివినవి మూడే లైన్లు 'ఓ ప్రియమైన గోపికలారా! మా ప్రియమిత్రుడైన ఉద్ధవుని పంపుతాను. అతని ఆదేశము ననుసరించండి'. 'ఇంతమాత్రమునకు మేము ఎందుకు ఇక్కడుండాలి? వెళ్లిపోతా'మని

sri sathyasai vahini vachanamrutam

వెళ్లారు, గోపికలు. ఉద్ధవుని ఒక్కరైనా కన్నెత్తి చూడలేదు. 'కృష్ణుని చూచిన కనులు మరొక పురుషుని చూడకూడదు', అని భావించారు గోపికలు.

**కనులుండి గ్రుడ్డులై కళ్యాణకరమైన**
**నీ మూర్తి దర్శింపనేరరైరి**
**చెవులుండి చెవుటులై అతి మనోహరమైన**
**నీ వాక్కు లాలింపనేరరైరి**
**పాణిపంకజమందు పర్తీశుడున్నను**
**పాడు సంసారము కోరుచుంద్రు**
**మించెడి కాంతితో మేరు పర్వతముండ**
**వెండిబంగారుకై వెదకుచుంద్రు**
**విశ్వ హృదయమందు వినిపించు ప్రణవంబు**
**వినుడు శ్రద్ధతోడ వీనులలర**
**కామ్యముక్తులనిడ కల్పకంబిదె సుమ్మి**
**మరువబోకుడిట్టి మంచిమాట.**

'ఇంత దురదృష్టవంతునకు ఏమని తెల్పాలి?' అని వారు విచారము చేస్తూ వచ్చారు. 'కట్టకడపటికి నా యోగక్షేమాన్నైనా విచారించండి' అన్నాడు. అప్పుడు గోపికలు 'ఉద్ధవా! నీకు అనేక మనస్సులుండవచ్చును. మా గోపికలకున్నది ఒకే మనసు. అది కృష్ణునితోబాటు మధురకు పోయింది. కనుక, నీ యోగక్షేమము విచారించటంగానీ, నీ యోగముయొక్క సూచన వినటానికిగానీ మాకు వేరొక మనసు లేదు' అని ఖండితంగా చెప్పేశారు. ఆ ఒక్కమాటతో ఉద్ధవుని తల గిఱ్ఱున తిరిగిపోయింది.

**జీవితానికి ఏది ఆదర్శవంతమైనదో తెలుసుకోవాలి**

ఏమిటి ఈనాటి చదువులు? ప్రపంచములోనున్న విషయాలన్నీ తలలోపల కూరికూరి తలపగిలేటట్లు ఈ విద్యలు చేర్చుకుంటున్నారు. అమెరికాలోనో, జపాన్‌లోనో, జర్మనీలోనో జరిగే అన్ని చింతలు తెచ్చి తలలో చేర్చుకుంటున్నారు. దీనికోసమా తల యిచ్చింది?

sri sathyasai vachanamrutam

**ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్చవచ్చు**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలుకాదు**
**కలి బోధలు నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగున**
**తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతంబు నింపనగునా!**

ఇవికాదు మన తలలో నింపుకోవలసినవి! ఏది ఆవసరమైనదో దానిని మాత్రమే పెట్టుకోవాలి. అనవసరమైనవి, చూచినవంతా, చేసినవంతా తలలో పెట్టుకోటం మంచిదికాదు. ఒక పల్లెలో ఒక అధ్యాపకుడు పిల్లలనందరిని చేర్చుకొని ఒక పాతకొట్టములోపల చదువు చెప్పుతున్నాడు. చెప్పాడు 3+3+3-2=ఎంత అన్నాడు. వాడు ఎక్కడో చూస్తున్నాడు పాపం. ఆ గురువుగారు అడిగాడు, 'ఏమిరా ఏమి చేస్తున్నావు, నేను చెప్పిందంతా చేరిందాలోపల?' అని. 'చిత్తము శివునిపై భక్తి పరులపై' అన్నట్లు వాని మనస్సు ఎక్కడో ఉంటున్నాది. 'సార్! అంతా చేరింది, తోకమాత్రం బయట ఉంది' అన్నాడు. ఆ పాతకొట్టములో ఒక తొఱ్ఱ ఉంటున్నాది. దాంట్లో ఒక ఎలుక చేరిపోయింది. ఎలక పూర్తిగా లోపలకు చేరిపోయింది, కాని తోక మిగిలిపోయింది. టీచరు బోధించేది ఒకటి, వీడు చూచింది చెప్పటం మరొకటి. ఇలాంటివి చేర్చుకోటానికి కాదు, తల యిచ్చి ఉండేది. జీవితానికి ఏది ఆదర్శవంతమైనది? తెలుసుకోవాలి.

**ఆత్మవిద్య బోధించే అధ్యాపకులు కావాలి**

సమాజమునకు ఆదర్శమునందించే విద్యార్థులుగా తయారుకావాలి. విద్య అనగా ఏమిటి? య-ఏది, విద్య-జ్ఞానము. ఏది జ్ఞానమునందించునో అదియే విద్య. ఈనాడు జ్ఞానమును ఎక్కడా అందించటంలేదు. అంతా అజ్ఞానమే! ఒకానొక సమయంలో పండితులిద్దరు చండ, అమార్కులు స్నానము చేయుటకు నదికి వెళ్లారు. ప్రహ్లాదుడు తోటి బాలురను చేర్చుకుని 'నారాయణ భజ నారాయణ్ నారాయణ భజ నారాయణ్ తన్ మన్ రంజన భవ భయ భంజన అసుర నిఘండన నారాయణ్' అని భజన చేయిస్తున్న దృశ్యం

వారికి కనపడింది.

**మత్స్యకూర్మవరాహనరహరివామన్‌కో అవతార్‌కియా**
**పరశురామ ఔర్ రామకృష్ణ బల్ దుష్టోంకో సంహార్‌కియా**
**హే అవతారి లీలాధారి కుంజవిహారి నారాయణ్।నారా।**
**భజనసే మన్‌కో సజన సునాకర్ భక్తిమార్గ దిఖలాదియా**
**సాయిభజనసే భవసాగర్ తారణ్ భీ సిఖలాదియా**
**పతితోద్ధారి పర్తివిహారి హే గిరిధారి నారాయణ్ ।నారా।**

నారాయణ భజన నేర్పిస్తూ చెబుతున్నాడు. చూశారా! మన అధ్యాపకులంతా మనలను ఎంత మోసము చేస్తున్నారో! అధ్యాపకులు, మీరు వేరుగా భావించకండి! నా తండ్రి హిరణ్యకశిపుడు అర్థకామములను మాత్రమే బోధించండి! ధర్మము మోక్షములను గురించి బోధించకండి అని ఈ అధ్యాపకులకు శాసనం చేశాడు. ఏమిటి మన చదువులు? కేవలం ధనమును సంపాదించటానికా? ధనమును సంపాయించుటకు కాలేజిలకు పోవలెనా, డిగ్రీలు తీసుకోవలెనా? బజారుకుపోతే బిక్షగాళ్లు ఎంతమంది సంపాయించటం లేదు? ఎంతమంది దొంగలు ధనము సంపాయించటంలేదు? ధనము సంపాయించుటకు విద్య అవసరమా? 'ఛీ! మన గురువులు ఈ విధమైన బోధలు చేస్తున్నారు. మనము వీటిని ఏమాత్రము అనుసరించకూడదు. ఇక కామము. విషయవాంఛలు అనుభవించుటకు విద్య కావలెనా? చూడు అదిగో కోతి, యిదుగో కుక్క, యిదుగో ఎలుక! ఇవి అన్నీ అనుభవిస్తున్నాయి. ఇవి అనుభవించుటకు చదువుకావలెనా! అక్కరలేదు. మనకు తెలియని ఆత్మవిద్య బోధించుటకు అధ్యాపకులు కావాలి. పదార్థమును బోధించుటకు అధ్యాపకులెందుకు, మనకు? అర్థకామములు బోధించే ఈ విద్యకు మనము విరుద్ధము కావాలి' ఈ విధంగా ప్రహ్లాదుడు పిల్లలకు బోధించాడు. అది విని స్ట్రైకు ప్రారంభము చేశారు పిల్లలంతా! 'నారాయణ భజ్ నారాయణ్' నారాయణుని నామమే ఉచ్చరించకూడదు. ఇంకేమైనా ఉచ్చరించు' అని హిరణ్యకశిపుడు ఆదేశించాడు. దానికి విరుద్ధంగా ఈ పిల్లలందరిని తయారు చేశాడు ప్రహ్లాదుడు. వచ్చారు చండ, అమార్కులు. తలలు కొట్టుకున్నారు. తాచెడిన కోతి వనమెల్ల

sri sathyasai vachanamrutam

చెడిచింది అన్నట్టుగా ఈ ప్రహ్లాదుడు మాత్రమే చేయటం కాకుండా పిల్లలందరు నారాయణ భజన చేస్తున్నారే ఏమి ఖర్మరా అని ప్రహ్లాదుని చాలా దండించారు. ఎంత దండించినా 'మీరు బోధించేది చాలా తప్పు. విద్యలో మొట్టమొదట ధర్మము పాదముగా ఉండాలి. ఇదే పురుషార్థములలో ప్రధాన సోపానము. ధర్మముతో అర్థమును సాధించాలి. ధనము కావలసినదే కానీ ధర్మముతో మనం ధనం సంపాయించాలి. వాంఛలు ఉండవలసినదే కానీ ధర్మముతో వాంఛలు అనుభవించాలి. ఈ విధంగా అనుసరించినప్పుడు మోక్షము అదే వస్తుంది', అని ప్రహ్లాదుడు చెప్పాడు. ఇంకా ఆకాశమునుండి టక్కున ఊట్టిపడదు, మోక్షము. పాతాళమునుండిగానీ భూతలమునుండిగానీ అది పుట్టిరాదు.

**అజ్ఞానము నశించటమే మోక్షము**

అజ్ఞానము నశించటమే మోక్షము. పైనున్న నివురును ఊదివేస్తే నిప్పు ఏ విధంగా కనిపిస్తుందో, అదేవిధంగా కప్పుకున్న మేఘములు కదలిపోతే సూర్యుడు మనకు ప్రకాశిస్తాడు. మనము మేఘములను పంపటానికి వేరే ప్రయత్నం చేయనక్కరలేదు. మేఘములను పుట్టించింది సూర్యుడే. తానే పుట్టించిన మేఘములు తననే కప్పివేసినప్పుడు తాను క్రోధము తెప్పించుకుంటాడా? కొంత సేపటిలో అవే కదలిపోతాయి. ఈ విద్యార్థులకు అధ్యాపకులు బోధించవలసింది ఇదికాదు. ధర్మము మొదటి పాదము. అర్థకామములు రెండవది. మోక్షమే top level. మిద్దె ఎక్కాలంటే నిచ్చెన వేసుకున్నాము. క్రింది step, పై step లేక మిద్దె ఎట్లా ఎక్కగలం? మధ్యలో నున్నవే ఈ రెండు. విద్యార్థులారా! ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు బోధించాలి మనము. మనమే టీచర్సు కావాలి, ఈ విధంగా ప్రహ్లాదుడు పిల్లలకు బోధించాడు. అతడు ఐదు సంవత్సరముల పిల్లవాడు. ఈనాటి సైంటిస్టులు వేయి సంవత్సరములు పరిశోధనలు చేసి అణుశక్తి సర్వత్రా ఉన్నాదనే సత్యమును యీనాడు ప్రబోధిస్తున్నారు. కానీ, ఐదు సంవత్సరముల విద్యార్థి ప్రహ్లాదుడు 'ఇందు కలడందు లేడని సందేహము వలదు' అని అనాడే చెప్పాడు. ఎక్కడ చూచినా అణువులోపల, కణములోపల భగవంతుడే ఉన్నాడు. దానినే ఈ సైంటిస్టులు atom అని చెబుతూ వచ్చారు. ఈ atom నే శక్తి అని ప్రబోధిస్తూ వచ్చారు. ఆ శక్తియే energy అన్నారు.

sri sathyasai vachanamrutam

ఆ energy నే God అన్నారు. ఇన్ని రకములుగా చుట్టుకొని చుట్టుకొని తెస్తున్నారు, యీ సైంటిస్టులు. అయితే, అధ్యాత్మికము దానిని direct గా అనుభవించుకుంటూ వచ్చింది. తట్టలోనున్న పదార్థము direct గా పొట్టలోకి చేరాలంటే నోటికి, చేయికి పని పెట్టాలికదా! ఈనాడు ఆ పొట్టలోకి పెట్టటానికి సైంటిస్టులు ఏమి చేస్తున్నారు? తిప్పి తిప్పి కట్టకడపటికి అక్కడకే పోయి చేరుతున్నాది. దీనిని సైన్సు ప్రభావము అన్నారు. ఏమిటి ఈ ప్రభావము? ఆనాడే ప్రహ్లాదుడు స్వల్పబుద్ధితోనే నేర్చుకున్నాడు. సైన్సు పిల్లలున్నారు. మీరంతా lab కి పోతున్నారు హైడ్రోజను రెండు భాగాలు, ఆక్సిజను ఒక భాగము కలిసి water అవుతుందంటారు. ఇది lab లో మాత్రమే! భోజనానికి కూర్చున్నప్పుడు హైడ్రోజను, ఆక్సిజను కలుపుకుంటున్నావా? లేదు. ఈనాటి education కేవలం education గా మిగిలిపోతున్నది గాని ఆనాటి education, elevation గా మారిపోయేది. ఆ elevation కావాలి, మనకిప్పుడు. మనకు elevation చాలా ఆనందమునిస్తుంది. మన విద్యావిధానమును సమాజంలో సర్వులకు అందుబాటయ్యే మార్గములో నిరూపించటానికి మనం ప్రయత్న పూర్వకంగా ఆచరించాలి. నీవు ఎక్కడైనా ఉండు, అంతా దైవమే చూచుకుంటాడు. ఆ విశ్వాసమును పెంచుకోవాలి.

**అడవిలోననున్న ఆకాశముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేటనున్నను**
**మదిని సాయి నిన్ను మరువడెపుడు.**

ఎక్కడున్నా అతనికి తెలిసిపోతుంది. సర్వత్రా ఉంటున్నాడు. నీ తల యిక్కడ ఉంటున్నాది, కాలు కింద ఉంటున్నాది. కాలుపైన చీమ పోతున్నాది. తక్షణమే దాన్ని కొట్టేశావుకదా! తల పోయిచూచిందా? సర్వత్రా ఉంటున్నాది, ఈ చైతన్య శక్తి.

**ఏది సర్వ విద్యలకు ఆధారమో అదే అధ్యాత్మిక విద్య**

దేహములో చైతన్యశక్తి ఏ విధంగా సర్వత్రా ఉంటున్నాదో అదే విధంగా భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. దేశము, దేహము బింబ ప్రతిబింబములే, భావఅభావములే! చీకటి,

sri sathyasai vahanamrutam

వెలుగు, రెండు లేవు. ఇప్పుడు చూడండి, చీకటిగా ఉంటున్నాది. లైటు వేస్తూనే చీకటి కనిపించదు. ఎక్కడపోయింది? తిరిగి లైటు ఆర్పివేస్తే చీకటి వస్తుంది. ఎక్కడనుంచి వచ్చింది? ఎక్కడకు పోలేదు, ఎక్కడనుంచి రాలేదు. చీకటి ఉన్నప్పుడు వెలుగు కనిపించదు, వెలుగున్నప్పుడు చీకటి కనిపించదు. ఇవి రెండూ భావ, అభావములే! ఉన్నది ఒక్కటే ఎప్పటికి. అదే సత్యం, ఆ సత్యమే త్రికాలాభాద్యం. అట్టి త్రికాలాభాద్యమైన సత్యతత్త్వాన్ని మనం ఎక్కడపోయినప్పటికి, ఏ పని చేసినప్పటికిని విస్మరించకూడదు.

విద్యార్థులారా! మీరు ఎన్ని విద్యలు నేర్చినప్పటికిని ఒకటి దృష్టిలో పెట్టుకోండి. ఏది సర్వ విద్యలకు ఆధారమో. అదే అధ్యాత్మవిద్య. 'అధ్యాత్మవిద్యను నేనే' అన్నాడు, కృష్ణుడు. Spiritual education ప్రత్యేకం కాదు. అన్నింటియందు spiritual education ఉండాలి. ఒక అయస్కాంతము ఉంటున్నాది. Iron filings ఉంటున్నాయి. అయస్కాంతము Iron filings ను టక్కున కరచుకుంటుంది. 'అయస్కాంతము చక్కగా ఆకర్షించింది', అనుకుంటున్నాం. కాదు, కాదు. అదీ దైవత్వమే! Magnet లో పవరూ తానే! Iron శుద్ధముగా ఉంటేనే దాన్ని ఆకర్షిస్తుంది, అయస్కాంతము. దురదృష్టవశాత్తు ఈనాటి మానవులు ఏ విధంగా భావిస్తున్నారు? ఒక్కొక్కప్పుడు magnet తీసుకుపోయి Iron దగ్గర పెట్టినా దాన్ని ఆకర్షించదు. అప్పుడు Iron ఏమని చెబుతున్నాది? ఈ magnet కి పవరులేదని. అప్పుడు magnet ఫక్కున నవ్విందంట! 'నీలో కావలసినంత dust, rust చేర్చుకున్నావు నేను ఎట్లా దగ్గర చేర్చుకునేది?' అని. ఆ dust and rust clean చేయి, iron magnet దగ్గరకు automatic గా వస్తుంది. మన జీవితం iron filings వంటిది. మానవుని దేహమంతా iron ముక్క. దాన్ని శుభ్రం చేసుకోవాలి. కేవలం soap వేసుకుని స్నానం చేసినంత మాత్రమునకాదు. లోపల, వెలుపల సర్వత్ర మనం శుభ్రంగా ఉండాలి. ఆ విధంగా ఉంటే దైవత్వమనే magnet టక్కున కరచుకుంటుంది. కరచుకొనటమేకాదు ఆ iron ను magnet గా మారుస్తుంది. అదే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'. magnet కు ఒక pin కరిపించండి. ఆ పిన్నును రెండు దినాలు పెట్టండి. మూడవదినం ఆ పిన్ను మేగ్నెట్టు అయిపోతుంది. దాని సంపర్కముచేత, దాని సంబంధముచేత, స్నేహముచేత iron ముక్క magnet గా మారిపోయింది. మంచిదానిలోని పవిత్రత ఈ విధంగా ఉంటుంది. గొడ్డలి తీసుకుని అడవికి వెడతారు. ఒక గంధము

చెట్టును కొడతారు గొడ్డలితో. కానీ అంత సుగంధమునందించే గంధపుచెట్టు నన్నీ గొడ్డలితో కొట్టాడని కోపగిస్తుందా? తన సుగంధమును గొడ్డలికికూడా అందిస్తుంది. ఎంత ఉపకారము!

**మనము చేసిన ఉపకారము ఏనాటికి వృథాకాదు**

ఒక చిన్న ఉదాహరణము. షిరిడీలో బాబా అక్కడకు వెళ్లినప్పుడు ఏదీలేదు. ఒక పాడు పడిన చావడి మాత్రం ఉండేది. అక్కడ ఒక చిన్న వేపచెట్టు పెరుగుతూ వచ్చింది. దానికి ఒక వైపుమాత్రమే నీడ ఉండేది. కొమ్మ యిట్లా పోయింది. ఆ వేపచెట్టు నీడలో కూర్చుని శ్రమ తీర్చుకునేవాడు బాబా. ఎంతో శ్రమపడి బిక్షానికి వెళ్లివచ్చినా అదే నీడలో కూర్చొనేవాడు. తరువాత లక్ష్మీబాయి అల్లుడు చిన్న మండపం కట్టించాడు. దానిలో కూర్చుంటూ వచ్చాడు. అక్కడ కూర్చొని ఈ వేప చెట్టుని చూచాడు. యిన్ని సంవత్సరములు తనకు చల్లని నీడనందించి ఎంతో ఉపకారము చేసిన వృక్షమును చూచి 'ఓ వృక్షమా! నాకు హాయిని, ఆనందమునందించిన నీ కొమ్మలు ఆకులు ఎప్పుడూ మధురముగానే ఉండునుగాక!' అని ఉచ్చరించాడు. అందువల్లనే, మీరు షిరిడికి వెడితే, ఆ ఒక్క కొమ్మలోని ఆకులు తీయగా ఉంటాయి గానీ మిగతా కొమ్మలు, ఆకులు తీయగా ఉండవు. అనగా ఉపకారము చేసేవారికి ఎప్పటికి ఉపకారంగానే ఉంటుంది. కనుక, మనము ఉపకారములో ఎంతైనా త్యాగము చేయాలి. ఉపకారమునందు ఉపకారమే మనకు ప్రాప్తిస్తుంది. అపకారము చేసినవారికికూడా ఉపకారము చేయి. అప్పుడు చక్కని ఫలితము వస్తుంది. మనము చేసిన ఉపకారము ఏనాటికీ వృథాకాదు. తక్షణమే ఉపకారము కలగలేదే అని విచారమునకు గురికాకూడదు, మనము. కొంతకాలమైతే తప్పక ఆ ఫలితము లభిస్తుంది.

**పుస్తకము, మస్తకము ఒకటై ఆచరణలో పెట్టటమే చదువులలోని రహస్యము**

విద్యార్థులారా! మీరు విద్యలన్నీ నేర్చటమే కాకుండా, వాటిని సక్రమమైన మార్గములో జగత్తులో ఉపయోగపెట్టాలి. తద్వారా సర్వజనులకు ఉపకారమయ్యే రీతిగా పంచభూతములలో ఏ ఒక్క శక్తినైనా పదిమందికి అందించేటందుకు కంకణము కట్టుకోవాలి. కేవలం గ్రంథములు చదివి practicalలో ఉపయోగపెట్టకపోతే చదువు



sri sathyasai vachanamrutam

నిరుపయోగమైపోతుంది.

**పుస్తకములనిండ మస్తుగ చదువుండె**
**మస్తకములనిండ మట్టిమెండు**

ఏమి ప్రయోజనము? ఆ పుస్తకము, మస్తకం కావాలి. పుస్తకము, మస్తకము రెండూ ఒకటై practical లో పెట్టాలి. చదువులలోని ఈ రహస్యము గుర్తించాలి.

**(తేదీ 28-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam